డ్రెయిన్లపై పైపులైన్లు తొలగించండి

- తాగునీటి శ్యాంపిల్స్ సేకరించండి
- వ్యర్థాలు రోడ్లపై వేయకుండా చూడండి
- కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయిన్లపై ఉన్న పైపులైన్లను షిఫ్ట్ చేయిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఏఈల వారీగా డ్రెయిన్లకు సమాంతరంగా ఉన్న తాగునీటి పైప్ లైన్లను యుద్ధప్రాతిపదికన షిఫ్ట్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ ఆనందపేట, జేకేసీ కాలేజీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, టెలికాం నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్లలో, డ్రెయిన్‌కు సమాంతరంగా తాగునీటి పైప్ లైన్లు లేకుండా చూడాల్సిన బాధ్యత ఏఈలదేనన్నారు. వర్షాలు గోతులు పడిన రోడ్లకు పాట్ హోల్స్ మెషిన్ ద్వారా మరమ్మతు చేపట్టాలన్నారు.

వార్డ్ సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు తాగునీటి సరఫరా జరిగే సమయంలో శ్యాంపిల్స్ సేకరించి క్లోరిన్ టెస్ట్ చేయాలని ఆదేశించారు. రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు పర్య వేక్షణ చేయాలన్నారు. ప్రజలు తమ ఇంటి నుంచి వ్యర్థాలను తడిపొడిగా ఇచ్చేలా అవగాహన కలిగించాలన్నారు. కార్మికులు తప్పనిసరిగా మధ్యాహ్నం వారికి కేటాయించిన ప్రాంతాల్లో డ్రెయిన్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అబీద్ భాష, డీఈఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బృందావన్ గార్డెన్స్‌లో ఆక్రమణలు తొలగింపు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని హనుమయ్య విగ్రహం నుంచి బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం వరకు బుధవారం నుంచి ఇరువైపులా డ్రెయిన్లపై ర్యాంప్‌లు, ఆక్రమణలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షం నీరు రోడ్ల మీద నుండి నేరుగా డ్రెయిన్‌లోకే వెళ్లాలని, అందుకు ముందుగా డ్రెయిన్లను ఓపెన్ చేసి, నూరు శాతం పూడిక తీయాలన్నారు.

ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు ఓవర్ ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో డ్రెయిన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని ఆదేశించారు. జిన్నాటవర్ నుంచి చేపట్టిన డ్రెయిన్లపై శ్లాబులు, ఆక్రమణల తొలగింపు, పూడికతీత పనులను వై.జంక్షన్ వరకు చేపట్టాలని డీసీపీని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు ఏఈల వారీగా బిల్లులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రజారోగ్య అధికారులు డివిజన్ల వారీగా మైక్రో ప్యాకెట్స్ రీ ఫైనల్ చేయడం, వాటికి కేటాయించిన కార్మికులు, ఇళ్ల సంఖ్యలతో కూడిన వివరాలు అందించాలన్నారు. డివిజన్లలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు అవసరమైన వాహనాలు, సామగ్రి కోసం రిపోర్ట్ ఇవ్వాలన్నారు.

ప్రజారోగ్య విభాగంలో కార్మికులను సద్వినియోగం చేసుకోవాలని, కొన్ని డివిజన్లలో మస్టర్ అనంతరం విధుల్లో కార్మికులు ఉండడం లేదని, మధ్యాహ్నం పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎస్ఎస్‌లకు కేటాయించిన అదనపు ట్రాక్టర్లు, కార్మికులతో చెట్ల కొమ్మలు, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇన్‌ఛార్జ్) సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నారాయణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సహకారం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి సహాయ, సహకారాలు అందిస్తానని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ను మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలు అందించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అసోసియేషన్ అన్నివేళల్లో సహకారం అందిస్తానని చెప్పారు. అసోసియేషన్ కార్యకలాపాలు, జిల్లా పోలీస్ సిబ్బందికి అందిస్తున్న సేవలు, సహాయ సహకారాలను జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యరాజు (అరండల్‌పేట పీఎస్ సీఐ), కార్యదర్శి శివ ప్రసాద్ (లాలాపేట పీఎస్ సీఐ)లు జిల్లా ఎస్పీకి వివరించారు. జిల్లా ఎస్పీని కలిసిన వారిలో పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేష్ (జిల్లా వెల్ఫేర్ ఆర్.ఐ), ఉపాధ్యక్షుడు మైలా సాంబశివరావు (ఏఎస్ఐ), సభ్యులు బేబీరాణి గారు (ఏఎస్ఐ), లక్ష్మయ్య (హెడ్ కానిస్టేబుల్) పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఆశ వర్కర్స్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు డిమాండ్



అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్లకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, చట్ట ప్రకారం అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని వాటి స్థానంలో 5జీ ఫోన్స్ ఇవ్వాలని, చనిపోయిన ఆశ వర్కర్స్‌కు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలోని మంగళదాస్ నగర్, ఇజ్రాయిల్ పేట, ఎల్బీనగర్ ,శుద్ధపల్లి డొంక, లాంచెస్టర్ రోడ్, లాలాపేట అర్బన్ హెల్త్ సెంటర్స్ లోని డాక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వటం జరిగింది. లాలాపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు జీతాలు పెరిగి ఆరు సంవత్సరాలు అవుతుందని ఈ ఆరు సంవత్సరాల కాలంలో నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు కె.ప్రమీల మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, అదే విధంగా వచ్చే జీతం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వటం వలన రెండుసార్లుగా రావడం వలన అనేక ఇబ్బందులు గురవుతున్నామని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ఉండాలని ఆమె అన్నారు. నిరసన అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దుర్గా, లక్ష్మి, సుధా, కేజియా భారతి, అనిత, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యావ్యవస్థ బలోపేతం

కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్



కృష్ణవేణిని సన్మానించిన విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాబోధనలో నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందంతో విద్యావ్యవస్థ బలోపేతమవుతుందని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని సీతారామయ్య పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణిని సన్మానించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయ బృంద సారథ్యంలో నాణ్యమైన బోధన అందిస్తునందుకు గుర్తుగా తమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రముఖ సంస్థల నుంచి పురస్కారాలను అందుకోవటం గర్వించదగిన విషయమన్నారు. ఆదివారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ కె.రత్నషీలామణి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ బి. గోపిమూర్తి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు నుంచి పురస్కారం అందుకున్న కృష్ణవేణికి పాటిబండ్ల విష్ణువర్ధన్‌తో పాటు పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గా శ్యామ్, కోఆర్డినేటర్స్ దిల్ జహాన్, టి. శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె.హరిప్రియ అభినందనలు తెలియజేశారు.

విద్యార్థికి గణిత శాస్త్రంతో మేధో వికాసం

గణిత శాస్త్ర బోధకుడు డాక్టర్ బి.సాయికిరణ్



మాట్లాడుతున్న సాయి కిరణ్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో గణితశాస్త్రంపై ఆసక్తి కనబర్చే విద్యార్థులు మిగతా అన్ని సబ్జెక్టుల్లో చురుగ్గా ఉంటూ మేధాశక్తిని కనబరుస్తారని ప్రముఖ గణిత శాస్త్ర బోధకుడు డాక్టర్ బి. సాయికిరణ్ పేర్కొన్నారు. నగరంపాలెంలో ప్రజ్ఞ పాఠశాలలో మంగళవారం 'వేదిక్ మ్యాథ్స్, మెమరీ టెక్నాలజీ, మైండ్ పవర్, మిడ్ బ్రెయిన్ యాక్టివేషన్'అంశాలపై ఐదు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, రెండుసార్లు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన మ్యాథ్స్ మెజీషియన్ డాక్టర్ సాయికిరణ్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ వేదాలు ప్రపంచ భాషలకు పునాది అయితే వేద గణితం అన్ని శాస్త్రాలకు తల్లి వంటిదన్నారు. ఏ సబ్జెక్టులోనైనా ప్రామాణికాలు అంకెలు లేకుండా ఉండవన్నారు. వేదిక్ మ్యాథమెటిక్స్ నేర్చుకోవటం చాలా సులువని, వాటిపై పట్టు సాధించడం ద్వారా మిగతా అన్ని విషయాలలో మేధావులుగా రాణిస్తారని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ మెరుగైన సాధారణ విద్యాబోధనతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కావలసిన అన్ని రకాల శిక్షణలు అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సుధారాణి, షేక్ సలీం, రవి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అల్లు కుటుంబానికి మరువలేని బహుమతి

ప్రముఖ చిత్ర నిర్మాత అల్లు అరవింద్



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అల్లు అరవింద్, సినీ దర్శకులు కొల్లు బాబి

నగరంపాలెం: అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి అల్లు కుటుంబానికి మరువలేని బహుమతి యిచ్చారని ప్రముఖ చిత్ర నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్/ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గుంటూరు నాజ్ కూడలిలో పద్మశ్రీ అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. దర్శకుడు కొల్లి బాబి, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, సొసైటీ అధ్యక్షుడు పెండెం వెంకటశివప్రసాద్, ఉపాధ్యక్షుడు రేజేటి రామకృష్ణ, కార్యదర్శి దళవాయి సుబ్రమణ్యం, కోశాధికారి టి.శ్రీనివాసరావు, లాల్‌వజీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: బీఆర్ స్టేడియం ఫీడర్ పరిధిలోని విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుంటూరు-4 డీఈఈ పి.రమేష్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బీఆర్ స్టేడియం, అంకమ్మతల్లి దేవాలయం, కమ్యూనిస్టు బొమ్మలు, సత్యనారాయణ స్వామి దేవాలయం, ఆలీనగర్, సూర్యనగర్, బాబోజీ, మఠం,, ముగ్దం నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

న్యాయమూర్తిపై దాడి అమానుషం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు యాదవ్



పట్నంబజారు: సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు, న్యాయవాది యేటి కోటేశ్వరరావు యాదవ్ స్పష్టం చేశారు. ఏటీ అగ్రహారంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయవ్యవస్థ గౌరవం కోసం ప్రజలు, ఉద్యమకారులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి జరిగిన దాడి ఎంతో బాధాకరమన్నారు. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదని, మొత్తం న్యాయవ్యవస్థ, న్యాయ స్వాతంత్ర్యం, రాజ్యాంగ విలువలపై జరిగిన ఘోర దాడిగా భావిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్య న్యాయవృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని చెప్పారు. ఇటువంటి ఘటనలు జరగటం న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయన్నారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరి కర్తవ్యమని, ప్రజా స్వామ్యవాదులు, మేధావులు ఈ ఘటనను ఖండించాలన్నారు. న్యాయమూర్తిపై దాడి అంటే న్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేయటమేనన్నారు. ఇటువంటి మతోన్మాదుల దుశ్చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

మాలలకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు

మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణతో సీఎం చంద్రబాబు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ ధ్వజమెత్తారు. మంగళవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర చేస్తుందని ఆరోపించారు. దళితులకు రిజర్వేషన్, వర్గీకరణ పేరుతో వాటాలు కల్పించడం సామాజిక న్యాయమా? మిగతా వాటికి అక్కర్లేదా అని నిలదీశారు. సామాజిక న్యాయమని చెబుతున్న చంద్రబాబు ఆయన అనుభవించే ముఖ్యమంత్రి పదవిని ఎస్సీలకు గాని, బీసీలకు గాని కట్టబెట్టగలరా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే ప్రయోజనమని, ఆ నలుగురికి ఇచ్చే ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1,108 ఉప కులాలకు ఎలా పంచుతారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: రవాణా రంగంలో విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయస్థాయిలో అవార్డులతో పాటు, నగదు బహుమతులను సాధించటం సంతోషకరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో యాజమాన్యం మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్ట్రాన్ మోటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ లెవల్ ఈ-బైక్ డిజైన్ ఛాలెంజ్ (సీజన్ 5.0) 2025 పోటీల్లో దేశంలోని వివిధ కళాశాలల నుంచి అనేక విద్యార్థుల బృందాలు పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈ-బైక్ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ అవార్డు (రూ.10,000 నగదు బహుమతి) గెలుచుకున్నారు.

నగరాభివృద్ధికి ఆస్తి పన్నులే కీలకం

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



మాట్లాడుతున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరాభివృద్ధిలో ఆస్తిపన్ను వసూళ్లు కీలకమని, ప్రతి వార్డు సచివాలయం పరిధిలో బకాయిలు, ప్రస్తుత పన్ను నూరు శాతం వసూళ్లు జరిగేలా అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. అభివృద్ధి పనులకు పన్ను వసూళ్లు అతి ముఖ్యమని ప్రతి ఒక్కరు పన్ను వసూళ్ళ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ అర్ధ సంవత్సరం వచ్చినప్పటికీ పన్ను వసూళ్ళలో పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. వాటర్ మీటర్ల చార్జీల వసూళ్లలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాటికి పురోగతి లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ కలెక్టబుల్ డిమాండ్ తొలగించడానికి పక్కా ఆధారాలతో రిపోర్ట్ ఇవ్వాలన్నారు. ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పన్ను వసూళ్ల పై శ్రద్ధ పెట్టకుంటే చర్యలు తప్పవన్నారు. వాటర్ మీటర్, ఆస్తిపన్ను వసూళ్లపై రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించి డెప్యూటీ కమిషనర్లు కూడా నేరుగా వసూళ్లలో పాల్గొనాలన్నారు. తమరోజువారీ క్షేత్రస్థాయి పర్యటనలో డిమాండ్ నోటీసులు పంపిణీ, పన్ను వసూళ్లు, అన్, అండర్ అసెస్‌మెంట్ల గుర్తింపు పై ప్రత్యేక తనిఖీలు చేపడతామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు రవి కిరణ్ రెడ్డి, మదన్ గోపాల్, సాదిక్ బాషా, రెహ్మాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

తపాలా వారోత్సవాల్లో ఆధార్ క్యాంపులు

డివిజన్ సూపరిటెండెంట్ యలమందయ్య

లక్ష్మీపురం: ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగే జాతీయ తపాలా వారోత్సవాలు 2025లో భాగంగా, తపాలా శాఖ, గుంటూరు డివిజన్, ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ నమోదు అప్డేట్ సేవలను అందించడానికి గాను అక్టోబర్ 8 నుంచి 14, వరకు డివిజన్ అంతటా ఆధార్ క్యాంపులను నిర్వహించడం జరిగిందని డివిజన్ సూపరిటెండెంట్ యలమందయ్య మంగళవారం తెలిపారు. ఈ క్యాంపులను వివిధ తపాలా కార్యాలయాలలో నిర్దేశించిన పాఠశాలలు, నివాస కాలనీలు గ్రేటెడ్ కమ్యూనిటీలతో సహా ఎంపిక చేసిన ప్రజా ప్రదేశాలలో ఏర్పాటు చేయడం జరుగుందని తెలియజేశారు. ఈనెల 8,9 తేదీలలో స్తంబాలగరువులోని విజ్ఞాన్ హైస్కూల్‌లో, ఈనెల 10,11వ తేదీలలో పెదవడ్లపూడి నాగార్జున హై స్కూల్‌లో, ఈనెల 13,14 తేదిలలో విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆధార్ నమోదు (ఎన్‌రోల్‌మెంట్) సేవలు ఉచితంగా అందించబడతాయని తెలియజేశారు.. అలాగే, 5 నుంచి 7 సంవత్సరాలు 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్లు కూడా ఉచితంగా అందించబడుతుందని తెలిపారు. అదనంగా, 7 నుండి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం చేసే తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ -1 లకు అప్ డేట్ సంబంధించి, 01.10.2025 నుండి 30.09.2026 వరకు ఒక సంవత్సరం పాటు రుసుములను యూఐడీఏఐ మినహాయించిందని తెలిపారు. ఇది మాత్రమే కాకుండా, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, తపాలా శాఖ ఆర్థిక చేరికను ప్రోత్సహించేందుకు పోస్ట్ ఆఫీస్ పొదుపు బ్యాంకు ఖాతాలు పది సంవత్సరాల లోపు ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు , మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను తెరుచుకొనే వెసులుబాటు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. తపాలా శాఖ సాధారణ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు, ఈ క్యాంపుల ద్వారా అందుబాటులో ఉన్న ఆధార్ ఆర్థిక సేవలను వినియోగించుకుని లబ్ధి పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కాకుమాను: చాలీచాలని జీతాలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెదనందిపాడు పీహెచ్‌సీ కార్యాలయం వద్ద ఆశ వర్కర్లు చేపట్టిన ధర్నాలో రమణ పాల్గొని మాట్లాడుతూ ఆశా డే సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆశాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు రమణ తెలిపారు. ఆశాలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తోటి ఉద్యోగులతో పాటు ఆశాలకు కూడా అన్ని సెలవులు ఇవ్వాలని, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవులు, క్యాజువల్ సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని ఆమె కోరారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్‌లుగా మార్పు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ప్రియంవదకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, సరిత, సర్వాదేవి, మేరీ, మణి, రత్న కుమారి, రాణి, త్రివేణి, జ్యోతి, విజయ, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10న మహిళా కళాశాలలో అధ్యాపక ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర బోధనకు అతిథి అధ్యాపకుల నియామకానికై ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ జంతుశాస్త్రంలో 55 శాతం మార్కులు కలిగి, నెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సంబంధిత ధ్రువపత్రాలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

జీఎస్టీ ధరల తగ్గింపుపై విద్యార్థినులకు పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్'పై విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. పద్మజ మాట్లాడుతూ జీఎస్టీ స్లాబుల తగ్గింపు కారణంగా సామాన్య కుటుంబాలకు మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన సామగ్రి కొనుగోలుపై జీఎస్టీ లేకపోవడంతో డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా పోటీల్లో తొలి స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ఉపాధ్యాయునులు ఉషాపద్మ, రాబియా బస్రీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ కార్యదర్శి యు.రమాదేవి, టి. శివరత్న, జి.అన్నపూర్ణ, డి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

13 గంటల పనివిధానాన్ని ఉపసంహరించుకోవాలి



లక్ష్మీపురం: ప్రభుత్వాలు 13 గంటల పని విధానాన్ని ఉప సంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ గుంటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు తూర్పు సీఐటీయూ నగర కార్యదర్శి కె. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసే దానిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల పని గంటలను 8 నుంచి 13 గంటలకు పెంచారని ఇది దుర్మార్గమని తీవ్రంగా విమర్శించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకష్ణ, సీఐటీయూ గుంటూరు పశ్చిమ కార్యదర్శి బి. ముత్యాలరావు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటివ్ యూనియన్ రాష్ట్ర నాయకులు సలీం, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, జిల్లా నాయకులు కె.నళిని కాంత్, మున్సిపల్ వర్కర్ సీనియర్ నాయకులు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన కచేరీ



నగరంపాలెం: స్థానిక నల్లచెరువు ఐదో వీధిలోని శ్రీకోదండ రామాలయం ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. అనంతరం స్వరరాగ సుధా (గుంటూరు) ఆధ్వర్యంలో సీతారామాంజనేయ గాన సంకీర్తన చేపట్టారు. గాయకులు కాటకరాజు వెంకట సాయిబాబు శర్మ బృందం భక్తి గీతాలు ఆలపించారు. భక్తులను అలరించాయి. కీబోర్డుపై ఈశ్వర్, తబలాపై షణ్ముఖ శర్మ వాయిద్యాన్ని అందించారు.

యువకుడిపై కేసు నమోదు

లక్ష్మీపురం: ఓ యువకుడు మరో యువకుడిని డబ్బు కావాలని అడుగగా వారి ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో స్నేహితుడి పెదవి కొరికి దాడి చేసి గాయపరిచిన ఘటన పై నగరంపాలెం పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాసరావుపేటకు చెందిన పవన్ కళ్యాణ్ అనే యువకుడు విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహించే చక్రవర్తి ఇద్దరు స్నేహితులు. అయితే పవన్ కళ్యాణ్, చక్రవర్తికి ఫోన్ చేసి రూ.4 వేలు డబ్బులు కావాలని అడుగగా చక్రవర్తి, పవన్ కళ్యాన్ వద్దకు వెళ్లి డబ్బులు గురించి మాట్లాడే నేపథ్యంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో చక్రవార్తి, పవన్ కళ్యాణ్ పెదవి కొరికి గాయపరచడంతో పవన్ కళ్యాణ్ ఆసుపత్రిలో చికిత్స పొంది మంగళవారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కాకుమాను: నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రముఖ క్రీడాకారులను స్మరించుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలును నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు, బోడిపాలెం, కొండపాటూరు, రేటూరు, గరికపాడు, ఏ.పీ.ఎస్. డబ్ల్యూ ఆయా పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీ.వీ.బి. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.